
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
ఆదివారం 31 మార్చి 2024



రంజాన్ వేళలు
ఇఫ్తార్ - ఆదివారం
సాయంత్రం - 6:35
సహర్ - సోమవారం
ఉదయం - 4:48

వీడలేమంటు.. వీడుకోలంటు..

బరువెక్కిన హృదయాలతో బైబై చెప్పుకున్న టెన్త్ విద్యార్థులు

ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి ఇక్కడే కలిశాము.. చదువులమ్మ చెట్టు నీడలో.. వీడలేమంటు... వీడుకోలంటు వెళ్లిపోతున్నాము చిలిపితనపు చివరి మలుపులో.. వి మిస్ ఆల్ ద ఫన్.. వి మిస్ ఆల్ ద జాయ్.. వి మిస్ యూ.. అంటూ టెన్త్ క్లాస్ విద్యార్థులు వీడ్కోలు చెప్పుకున్నారు. పరీక్షలు ముగియడంతో ఇంతకాలం కలిసి చదువుకున్న స్నేహితులను వదిలి వెళ్లాల్సి రావడంతో గుండె లోతుల్లో నుంచి తన్నుకు వస్తున్న దుఃఖాన్ని దిగమింగుకుంటూ కన్నీటితో ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకున్నారు. సాధారణంగా పరీక్ష పూర్తి కాగానే మరో పరీక్షకు సిద్ధమయ్యేందుకు వెంటనే ఇళ్లకు వెళ్లిపోయే విద్యార్థులు.. ఆఖరి రోజు మాత్రం పరీక్షా కేంద్రాల నుంచి వచ్చే స్నేహితుల కోసం బయట వేచి ఉండి ఒకరికొకరు ఆలింగనం చేసుకొని వీడ్కోలు పలికారు. బరువెక్కిన హృదయాలతో ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకుంటూ స్వగ్రామాలకు వెళ్లిపోయారు.

- స్నేహం ఇలాగే కొనసాగాలంటూ ఆలింగనాలు
- ఒకరికొకరు ఫోన్‌నంబర్లు తీసుకున్న ఫ్రెండ్స్
- చివరగా బేకరీలు, జ్యూస్ సెంటర్లలో పార్టీలు
- ముగిసిన పరీక్షలు.. ఇళ్లకు చేరిన విద్యార్థులు



మర్పల్లిలో పరీక్ష అనంతరం సెల్ఫీ తీసుకుంటున్న విద్యార్థినులు



ఘట్‌కేసర్: ఆటోలో వెళ్తూ పేపర్లు చించి ఎగరవేస్తున్న విద్యార్థులు

వికారాబాద్/మేడ్చల్ (ఆంధ్రజ్యోతి ప్రతినిధి), మార్చి 30 : వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పరీక్షలు ముగియడంతో ఎగ్జామ్ సెంటర్ల నుంచి బయటకు వచ్చిన విద్యార్థులు హుషారుగా కనిపించారు. ఈలలు, కేకలతో పరీక్షా కేంద్రాల వద్ద సందడి చేశారు. వార్షిక పరీక్షల కోసం కొన్ని నెలలుగా పట్టుదలతో చదివిన విద్యార్థులు.. నేటితో పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఆనందంగా ఎగిరి గంతేశారు. వేసవి సెలవులు ఎంజాయ్‌గా గడుపుతామని పలువురు విద్యార్థులు పేర్కొంటున్నారు. విద్యార్థులందరూ ఒకచోట కలుసుకున్నారు. ఇకపై తమ స్నేహం ఇలాగే కొనసాగాలని చెప్పుకొని.. ఒకరికొకరు తమ సెల్ ఫోన్ నెంబర్లు తీసుకున్నారు. మంచి మార్కులతో పాసైతే.. మళ్లీ ఒకే కాలేజీలో చేరుదామని చెప్పుకున్నారు. ఎలాగైనా మనం మళ్లీ కలుసుకుందామని అనుకున్నారు. పరీక్షలు రాసిన తర్వాత కొంత మంది విద్యార్థులు రెస్టారెంట్లకు వెళ్లి బిర్యానీ తిన్నారు. సమీపంలోని బేకరీల్లో పార్టీ చేసుకున్నారు. జ్యూస్ సెంటర్ల వద్దకు వెళ్లి పానీయాలు తాగారు. కాసేపు కబుర్లు చెప్పుకున్నారు. ఇన్నాళ్లు కలిసి చదువుకొని విడిపోతూ కొందరు బాధపడ్డారు. ఎవరి ఇంటికి వారు వెళ్లి పోతూ చివరగా సెల్ఫీలు దిగారు. అనంతరం టాటా చెబుతూ ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకున్నారు. గతనెల 18వ తేదీన ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు శనివారంతో ముగిసాయి. జిల్లాలో మొత్తం 80 కేంద్రాల్లో కొనసాగిన ఈ పరీక్షలకు మొత్తం 15,509 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా సగటున 15,431 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలకు రెగ్యులర్ విద్యార్థులు 13,462 మంది, వన్స్ ఫెయిల్డ్ విద్యార్థులు 2,047 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. రెగ్యులర్ విద్యార్థుల్లో 99.50 శాతం పరీక్షలకు హాజరు కాగా, వన్స్ ఫెయిల్డ్ విద్యార్థుల్లో సగటున 85 శాతం హాజరు నమోదైంది. ఇదిలా ఉంటే, శనివారం జరిగిన సాంఘిక శాస్త్రం పరీక్షకు 13,475 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 13,403 మంది విద్యార్థులు హాజరు కాగా, 72 మంది గైర్హాజరయ్యారు. రెగ్యులర్ విద్యార్థుల్లో 13,412 మందికి 13,349 మంది హాజరు కాగా, 63 మంది గైర్హాజరయ్యారు. వన్స్ ఫెయిల్డ్ విద్యార్థులు 63 మందికి 54 హాజరు కాగా, 9 మంది గైర్హాజరయ్యారు. పదో తరగతి పరీక్షలకు రెగ్యులర్ విద్యార్థులు 99.53 శాతం, వన్స్ ఫెయిల్డ్ విద్యార్థులు 85.71 శాతం హాజరు నమోదైంది. కాగా మేడ్చల్ జిల్లాలో పది పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఒకేషనల్ కోర్స్ వారికి ఏప్రిల్ 2న పరీక్షలు ముగుస్తాయి.

ముందస్తు చర్యలతో..

వికారాబాద్ జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా జిల్లా యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు చోటు చేసుకోలేదు. ఈనెల 21వ తేదీన బంట్వారం మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రంలో నిర్వహించిన ఇంగ్లీష్ పరీక్షలో ఓ విద్యార్థిపై మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేయడం విమర్శలకు చోటు కల్పించింది. ఇదిలా ఉంటే, పరీక్షలు ముగియడంతో జిల్లా విద్యా శాఖ అధికారులు హాయిగా ఊపిరి పీల్చుకున్నా.. ఫలితాలు ఏ విధంగా ఉంటాయోనన్న ఆందోళన వారిలో వ్యక్తమవుతోంది.

పుట్టెడు దుఃఖంతో 'పది' పరీక్షకు హాజరు

మర్పల్లి : తండ్రి మరణవార్తను దిగమింగుకొని పదో తరగతి చివరి పరీక్ష రాసింది ఓ విద్యార్థిని. మర్పల్లి మండలం పట్లూర్ అనుబంధ గ్రామం కట్టెపహాడ్ తండాకు చెందిన మేఘనాథ్, నక్కిబాయి దంపతులకు ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె సోనీబాయి మర్పల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి చదువుతోంది. సోనీ తండ్రి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం చనిపోయాడు. పరీక్ష రాసేందుకు వెళ్లిన సోనీకి విషయం తెలిసింది. తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆమెకు ధైర్యం చెప్పడంతో బాధ నుంచి తేరుకొని పరీక్ష రాసింది.



కొర్రెముల జిల్లా పరిషత్ పాఠశాలలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



మేడ్చల్‌లో ఆలింగనం



ధారూరులో పరీక్ష అనంతరం ఉల్లాసంగా విద్యార్థులు



పరిగిలో ఫోన్‌నంబర్లు రాసుకుంటున్న విద్యార్థులు

ఎన్నికల ప్రక్రియపై పీవో, ఏపీవోలకు శిక్షణ



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్/మేడ్చల్(ఆంధ్రజ్యోతి ప్రతినిధి), మార్చి 30 : ఏప్రిల్ 2, 3, 4వ తేదీల్లో పీవో, ఏపీవోలకు లోక్‌సభ ఎన్నికల ప్రక్రియపై శిక్షణ ఇవ్వన్నట్లు కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో చేపట్టాల్సిన విధులు, ఇతర అంశాలపై జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ హైదరాబాద్ నుంచి శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, ఎన్నికల విధులు నిర్వహించే పోలింగ్ ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులతో పాటు ఇతర అధికారులకు శిక్షణ ఇవ్వడంపై వికాస్‌రాజ్ పలు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులతో మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు పోలింగ్ అధికారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ వివరాలను ఏప్రిల్ 6 లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, తాండూరు, వికారాబాద్ ఆర్డీవోలు శ్రీనివాసరావు, వాసుచంద్ర, డీఈవో రేణుకాదేవి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'పోస్టల్ బ్యాలెట్'


అర్హులైన వారందరికీ పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సౌకర్యం కల్పించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శనివారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సౌకర్యంపై జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల్లో పాల్గొనే సిబ్బందికి ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. రవాణా, మీడియా, విద్యుత్, బీఎస్‌ఎన్‌ఎల్, ఆర్టీసీ, అగ్నిమాపక, పోలీసు మొదలగు అత్యవసర శాఖల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. 85 సంవత్సరాల పైబడి పూర్తిగా నడవలేని సీనియర్ సిటిజన్లకు, నడవలేని దివ్యాంగులకు, కోవిడ్ పేషెంట్లకు ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని కల్పిస్తామన్నారు. అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ అగస్త్యా, డీఆర్వో హరిప్రియ, ఎలక్షన్ సూపరింటెండెంట్ రాజేశ్వర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలచే ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులకు సంబంధించిన పనులను పూర్తిచేయాలని కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో కలెక్టర్, ఈఈపీఆర్ ఈఈ, ఆర్ అండ్ బీ, ఎంఏయూడీ, ఆర్‌డబ్ల్యూఎస్, ఈడబ్ల్యూఎస్, ఐడీసీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల గురించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో చేపట్టాల్సిన పనుల గురించి కార్యాచరణ రూపొందించుకోవాలని, అందుబాటులో ఉన్న ఇంజనీరింగ్ అధికారులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను, ఏజెన్సీలను నియమించాలన్నారు. ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి అవసరమైన ప్రతిపాదనలు పంపాలన్నారు. డీఈవో విజయకుమారి, ప్లానింగ్ అధికారి మోహన్‌రావు, ఆర్అండ్‌బీ ఈఈ శ్రీనివాస్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.





పరిగిలో జోరుగా.. మత్తు దందా!

యువత, మైనర్లే టార్గెట్

గంజాయి, గుట్కా, జర్దా తదితర మత్తు పదార్థాల మాఫియాకు పరిగి కేంద్రంగా తయారవుతోంది. నిషేధిత మత్తు పదార్థాలను మహారాష్ట్రలోని పుణె, కర్ణాటకలోని బీజాపూర్, గుల్బర్గా, సేడం ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటూ పరిగిలో డంప్ చేసి ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్టు తెలుస్తోంది. కర్ణాటక-తెలంగాణ సరిహద్దుల్లోని వ్యవసాయ క్షేత్రాల్లోని రహస్య స్థావరాల్లో మత్తు పదార్థాలను నిల్వ చేసి దందా చేస్తున్నారు. గుట్కా తయారీ, నిల్వ, రవాణాను ఇక్కడి నుంచి కొనసాగిస్తున్నారు. గంజాయి, కొకైన్, నల్ల మందు తదితర మత్తు పదార్థాలు, గుట్కా, జర్దా అమ్మకాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నా నియంత్రణ కావడం లేదు. అక్రమార్కులకు కొందరు ప్రభుత్వ సిబ్బంది సహకారం వల్లే దందా కొనసాగుతోందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

- తాజాగా గంజాయి కేసుపై నెలకొన్న అనుమానాలు
- దందాకు కొందరు సిబ్బంది సహకారం?
- రాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో గుట్కా స్థావరాలు
- పరిగి మీదుగా హైదరాబాద్, ఇతర పట్టణాలకు రవాణా

పరిగి, మార్చి 30 : ప్రజారోగ్యాన్ని కాంక్షించి ప్రభుత్వం నిషేధించిన వివిధ రకాల డ్రగ్స్, గంజాయి, గుట్కా, జర్దా అమ్మకాలు జోరందుకుంటున్నాయి. జిల్లా సరిహద్దు ప్రాంతాలైన కర్ణాటక-తెలంగాణ సరిహద్దు వ్యవసాయ క్షేత్రాల్లో రహస్య కేంద్రాల్లో మత్తు పదార్థాలను నిల్వ చేసిన దందా చేస్తున్నారు. ఇక్కడి రహస్య ప్రదేశాలను మత్తు పదార్థాల డంపింగ్ స్థావరాలుగా చేసుకుంటున్నారు. వాటిల్లో భారీగా సరుకును నిల్వ చేస్తున్నారు. పోలీసులు, ఆహార నియంత్రణ అధికారులు పట్టించకోకపోవడంతో అక్రమ వ్యాపారానికి అడ్డే లేకుండా పోతోంది. మత్తుదందాపై ఉక్కుపాదం మోపుతామని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించినా ఆయన సొంత జిల్లాలోనే డ్రగ్స్ జాడలు జడలు విప్పుతున్నాయి. జిల్లాలో మత్తు పదార్థాలదందా ఏటేటా విస్తరిస్తోంది. గతంలో నగరాలు, పట్టణాలకే పరిమితమైన డ్రగ్స్ దందా ఇప్పుడు గ్రామాలు, మండల కేంద్రాలకూ విస్తరిస్తోంది. యువత, విద్యార్థులు మత్తుకు బానిసవుతున్నారు. పరిగి కేంద్రంగా చాన్నాళ్లుగా కొందరు మత్తు మందు వ్యాపారాన్ని సాగిస్తున్నారు. ఇందుకు అధికారుల సహకారం కూడా లభిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. తాజాగా గత మంగళవారం గంజాయి కేసులో నిందితుల రిమాండ్‌పై పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఓ అధికారి సూచన మేరకే తాము గంజాయి సరఫరా చేస్తున్నట్టు నిందితులు పేర్కొన్నా విషయం బయటకు పొక్కకుండా పోలీసులు అమాయకులను ఇరికించినట్టు తెలుస్తోంది. ఇప్పటికే గుట్కా వ్యాపారం జోరుగా సాగుతున్నా పట్టించుకునే నాథుడు లేడు. తాజాగా గంజాయి దందాకు తెరతీశారు. ఏకకాలంలో గుట్కా, గంజాయి, డ్రగ్స్ అమ్ముతున్నారు. పరిగిలో స్థిరపడ్డ ఇతర రాష్ట్రాల వారు కొందరు స్థానికులతో కలిసి మత్తు పదార్థాల వ్యాపారాన్ని సాగిస్తున్నారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గంజాయి, కొకైన్, ఇతర రకాల మత్తు పదార్థాలను దిగుమతి చేసుకుంటూ పరిగి కేంద్రంగా డంప్ చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం.



ఇటీవల పరిగిలో పట్టుబడిన గంజాయి, నిందితులు

పరిగిలోని రెండు చోట్ల రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు మత్తు పదార్థాలను అమ్ముతున్నట్లు తెలుస్తోంది. పరిగిలోని ఓ రెండు టీ స్టాళ్లలోనూ సిగరెట్ల రూపంలో మత్తు పదార్థాలను అమ్ముతున్నట్టు సమాచారం. మత్తు పదార్థాలను మహారాష్ట్రలోని పుణె, కర్ణాటకలోని బీజాపూర్, గుల్బర్గా, సేడం ప్రాంతాల నుంచి పరిగికి తెచ్చి ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్టు కూడా తెలుస్తోంది. మొత్తానికి పరిగిని మత్తుపదార్థాల డంపింగ్ డెన్‌గా వాడుకుంటున్నారు.



పట్టుబడిన గంజాయి మొక్కలు(ఫైల్)

సమాచారం. ఒకరిద్దరు పోలీస్ శాఖ ఉద్యోగుల చేతుల మీదుగానే దందా నడిపిస్తున్నారనే ఆరోపణలొస్తున్నాయి. పరిగి శివార్లలో ఒకటి రెండు వ్యవసాయ క్షేత్రాల్లో ఏర్పాటు చేసిన మత్తు మందు కేంద్రాలకు యువత, ఉన్నత వర్గాలకు చెందిన వారు కూడా తరచూ వెళుతూ మత్తు పదార్థాలకు అలవాటుపడినట్లు తెలుస్తోంది.

ఏటికేడు పెరుగుతున్న మత్తు బాధితులు

ప్రభుత్వం గంజాయి, కొకైన్, నల్లమందు, గుట్కా, అల్ప్రాజోలం వంటి మత్తు పదార్థాల వాడకాన్ని, అమ్మకాన్ని నిషేధించి కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నా.. వాటిని వాడుతున్న వారి సంఖ్య మాత్రం ఏటికేడు పెరుగుతోంది. నిజానికి ప్రభుత్వ చర్యలతో ఎక్కడా మత్తు పదార్థాల అమ్మకాలు జరగకూడదు. కొనేవారికీ లభించకూడదు. కానీ దీనికి విరుద్ధంగా మత్తుపదార్థాలను వినియోగిస్తున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ముఖ్యంగా యువత, విద్యార్థులు మత్తుకు బానిసలవుతున్నారు. స్థానికంగా మత్తు పదార్థాల అమ్మకాల వల్లే మత్తు బాధితులు పెరుగుతున్నారు. ప్రభుత్వం, పోలీసులు, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ అధికారులు మత్తు పదార్థాలను అరికట్టేందుకు చేపడుతున్న చర్యలు పూర్తి ఫలితాన్నివ్వడం లేదు. ఇదిలా ఉంటే ఆయా శాఖల్లోని కొందరు సిబ్బంది, అధికారుల కక్కుర్తితో అక్రమార్కులకు అందుతున్న సహకారం వల్ల దందా నిరాటంకంగా కొనసాగుతోంది. డ్రగ్స్ మాఫియా కొందరు అధికారులను మచ్చిక చేసుకొని మత్తుపదార్థాల అమ్మకాన్ని జోరుగా సాగిస్తోంది.

నిరాటంకంగా దందా!

పరిగిలో మత్తు పదార్థాలకు అలవాటుపడ్డ వారి సంఖ్య కొంతకాలంగా భారీగా పెరిగింది. వీరిలో 18 నుంచి 25ఏళ్ల లోపు యువత ఎక్కువ మంది ఉన్నారు. మత్తు దందాతో పాటు గుట్కా వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయగాలు విరాజిల్లుతోంది. డ్రగ్స్, నకిలీ గుట్కా తయారీ, రవాణాకు రాష్ట్ర సరిహద్దు వ్యవసాక్షేంత్రాలు, జిల్లాలోని కొడంగల్, తాండూరు శివారుల్లోని రహస్య స్థావరాలు అడ్డాలుగా మారాయి. అక్రమ వ్యాపారాన్ని రాత్రిపూట ఏజెంట్ల ద్వారా కొనసాగిస్తూ రూ.లక్షలు సంపాదిస్తున్నారు. పరిగికి చెందిన ఒకరిద్దరు వ్యాపారులు, మత్తు వ్యాపారంలో పోలీసు సిబ్బంది సహకారం తీసుకుంటున్నట్టు

గుట్కా తయారీ కేంద్రాలు.. నిల్వ స్థావరాలు

మత్తు దందా ఇలా ఉంటే.. నిషేధిత గుట్కా వ్యాపారం కూడా భారీగానే జరుగుతోంది. గతంలో పరిగిలో భారీఎత్తున గుట్కా మెటీరియల్ పట్టుబడింది. తెలంగాణ-కర్ణాటక సరిహద్దుల్లో స్థావరాలేర్పాటు చేసుకొని గుట్కా తయారీ, నిల్వ చేస్తున్నారు. కర్ణాటకలోని గుల్బార్గా, గుర్మిట్కల్, సేడం, మల్కేడ్, బీదర్ తదితర ప్రాంతాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో నకిలీ గుట్కా తయారీ, నిల్వ చేసుకుని వేరే ప్రాంతాలకు తరలిస్తున్నారు. గోవా, మానిక్‌చంద్, విమల్ తదితర బ్రాండ్ల పేరుతో నకిలీ గుట్కాను తయారు చేస్తూ రీటైల్ దుకాణాలకు, బల్క్‌గా వేరే ప్రాంతాలకు తరలిస్తున్నారు. వ్యాపారులు సిండికేటై శివార్లలో తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నారు. సేడెం, గుల్బర్గా, గుర్మిట్కల్, జిల్లాలోని తాండూరు కొడంగల్, పరిగి ప్రాంతాల్లో గుట్కా ప్యాకెట్లను నిల్వ చేస్తారు. ఇక్కడి నుంచి పరిగి, కొడంగల్, తాండూరు, వికారాబాద్, హైదరాబాద్‌లకు గంజాయి, గుట్కా, జర్దా సరఫరా చేస్తున్నారు. ఈ అక్రమ దందాతో రోజుకు రూ.10లక్షల అక్రమ వ్యాపారం సాగిస్తున్నట్టు సమాచారం. తాండూరు, కొడంగల్, పరిగి, హైదరాబాద్‌లలో వందకుపైగా హోల్‌సేల్ కేంద్రాలున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఒక్కో గుట్కా వ్యాపార కేంద్రంలో నిత్యం రూ.10వేల నుంచి రూ.50వేల వరకు సరుకు అమ్మకాలు సాగుతున్నాయి. పాన్ డబ్బాలు, కిరాణ షాపుల్లో గుట్కాలు అమ్ముతున్నారు. మత్తు మందు, గుట్కాల వాడకంతో బాధితులు మౌత్ క్యాన్సర్, లివర్, ఊపిరితిత్తుల వ్యాధులకు గురవుతున్నారు. జిల్లా అధికారులు, ప్రభుత్వం మత్తు పదార్థాలు, గుట్కా, జర్దా దందాలపై మరిన్ని కఠిన చర్యలు తీసుకుంటే గానీ అరికట్టలేని పరిస్థితి నెలకొంది.

జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ద్వితీయ బహుమతితో మేడిపల్లికలాన్ విద్యార్థులు

పూడూరు, మార్చి 30: మండలంలోని మేడిపల్లికలాన్ ప్రభుత్వ అప్పర్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి క్విజ్‌పోటీల్లో ప్రతిభ కనబరిచారు. శిక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం వికారాబాద్ జిల్లా స్థాయి హైస్కూల్ లెవల్ క్విజ్ పోటీలు జరిగాయి. ఈపోటీల్లో మేడిపల్లి కలాన్ ప్రభుత్వ అప్పర్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయిలో ద్వితీయ బహుమతిని సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు ఈ సందర్భంగా అభినందించారు.

ధారూరు మార్కెట్‌లో కంది, మొక్కజొన్న బీట్లు

ధారూరు, మార్చి 30: ధారూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం సాయంత్రం కంది, మొక్కజొన్న పంట ఉత్పత్తులకు బీట్లు నిర్వహించారు. ఈ బీట్లలో కందులు క్వింటాలుకు రూ.10210 నుంచి రూ.10,150ల వరకు, మొక్కజొన్న క్వింటాలుకు రూ. 2,130 నుంచి రూ. 2,230ల వరకు ఖరీదుదారులు కొనుగోళ్లు చేశారు. కాగా 105క్వింటాళ్ల కందులు, 100 క్వింటాళ్ల మొక్కజొన్న క్రయవిక్రయాలు జరిగాయని మార్కెట్ సహాయ కార్యదర్శి సిద్దమ్మ తెలిపారు.

టీవీ, సోషల్ మీడియా చానళ్లలో తప్పుడు ప్రచారం

» 10 సంస్థలకు నోటీసులు పంపా: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కొన్ని టీవీ చానళ్లతోపాటు, యూట్యూబ్, సోషల్ మీడియా సంస్థలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ లీగల్ నోటీస్‌లు పంపించారు. ఇప్పటికే పలు చానళ్లకు లీగల్ నోటీస్‌లు పంపిన కేటీఆర్.. శనివారం మరో 10 సంస్థలకు లీగల్ నోటీస్‌లు పంపించారు. తనను, తన కుటుంబాన్ని బద్నాం చేయాలనే కుట్రలో భాగంగా అసత్య ప్రచారాలు, కట్టు కథలు అల్లుతున్నాయని, అందుకే ఆయా మీడియా సంస్థలకు నోటీసులు పంపినట్లు కేటీఆర్ వెల్లడించారు. మీడియా ముసుగులో అవన్నీ కుట్ర చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. అయితే ఇప్పటికే కొన్ని మీడియా సంస్థలు తప్పు తెలుసుకుని వీడియోలు తీసివేసినట్లు తనకు సమాచారం అందించాయన్నారు. వారంలోగా మిగతా చానళ్లు కూడా తీసివేయాలని, లేదంటే వాటిపై చట్టప్రకారం ముందుకెళ్తామని శనివారం కేటీఆర్ ఒక ప్రకటనలో తెలిపారు.

కేసీఆర్ అవినీతిపై సమగ్ర విచారణ జరపాలి

» విదేశాలకు పారిపోకుండా పాస్‌పోర్టును సీజ్ చేయాలి

» హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో జేఏసీ ఫిర్యాదు

హుస్నాబాద్, మార్చి 30: బీఆర్ఎస్ పది సంవత్సరాల పాలనలో మాజీ సీఎం కేసీఆర్ చేసిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శనివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో నియోజకవర్గ జేఏసీ నాయకులు ఫిర్యాదు చేశారు. అవినీతికి పాల్పడిన కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, కవిత, సంతోష్‌రావు విదేశాలకు పారిపోకుండా వారి పాస్‌పోర్టులు సీజ్ చేయాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, సచివాలయనిర్మాణం, వరంగల్ జైలు కూల్చివేత, గొర్ల పంపిణీ, దళిత బంధు, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలకు అనుమతులు, ధరణి పేరిట భూ కబ్జాలు తదితర అంశాలపై రూ.లక్షల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు.

ఏళ్లు గడిచినా గుర్తింపు లేదని..

» సీఎం నివాసం వద్ద కాంగ్రెస్ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

బంజారాహిల్స్, మార్చి 30, (ఆంధ్రజ్యోతి): పార్టీలో చేరి సంవత్సరాలు గడుస్తున్నా తనకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఓ కాంగ్రెస్ కార్యకర్త సీఎం నివాసం వద్ద ఆత్మహత్యాయత్నం చేశాడు. వరంగల్ జిల్లా భూపాలపల్లికి చెందిన కృష్ణ సాగర్ నగరంలోని రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటూ వ్యాపారం చేస్తున్నాడు. కాంగ్రెస్ కార్యకర్తగానూ వ్యవహరిస్తున్నాడు. జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసం వద్దకు శనివారం కారులో వచ్చాడు. సీఎంను కలిసేందుకు ప్రయత్నించగా భద్రతా సిబ్బంది వారించారు. దీంతో కృష్ణ సాగర్ తనతో తెచ్చుకున్న డీజిల్ పోసుకొని నిప్పు అంటించుకుంటానంటూ బెదిరించాడు. అక్కడే ఉన్న పోలీసులు స్పందించి జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కృష్ణసాగర్ మాట్లాడుతూ తాను సీఎం రేవంత్‌తోపాటు టీడీపీ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చినట్టు చెప్పాడు. పార్టీలో ఏళ్లుగా పనిచేస్తున్నా గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

జూన్1 నుంచి ఇంటర్ కాలేజీల ప్రారంభం

హైదరాబాద్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యాసంవత్సరానికి (2024-25) సంబంధించిన అకడెమిక్ క్యాలండర్‌ను ఇంటర్ బోర్డు శనివారం ప్రకటించింది. దీనిప్రకారం జూన్ 1 నుంచి కొత్త విద్యాసంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయి. నవంబరు 18 నుంచి అర్ధ సంవత్సర పరీక్షలు, 2025 జనవరి 20 నుంచి ప్రీఫైనల్, ఫిబ్రవరి మొదటివారంలో ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి మొదటివారంలో వార్షిక పరీక్షలు ఉంటాయని బోర్డు తెలిపింది.

పోలీస్ టు పొలిటికల్



(మొదటి పేజీ తరువాయి)

మలుపు తిరిగింది. "సాధారణంగా టాస్క్‌ఫోర్స్ బృందాలు, స్పెషల్ ఆపరేషన్ బృందాలు ఎన్నికల సమయంలో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ బూత్‌లపై దృష్టిపెడతాయి. స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ పేరుతో ఈ బృందాలు తమకు వచ్చిన సమాచారం మేరకు ఏ నియోజకవర్గంలోనైనా పర్యటిస్తాయి. అనుమానితులను సోదా చేస్తాయి. వీరి వాహనాలను ఇతర తనిఖీ బృందాలు అడ్డగించవు" అని ఓ విశ్రాంత పోలీసు అధికారి వివరించారు. దీన్నిబట్టి రాధాకిషన్‌రావు తమకు ఉన్న అధికారాలను, వెసులుబాట్లను దుర్వినియోగం చేసి, డబ్బు తరలించి ఉంటారని దర్యాప్తు అధికారులు అంచనాకు వచ్చారు. ఎవరి కోసం డబ్బు తరలించారు? ఎవరికి అందజేశారు? అనే ప్రశ్నలకు రాధాకిషన్‌రావు నోరు విప్పితే.. రాజకీయ నాయకుల పాత్ర బయటకు వస్తుందని తెలుస్తోంది. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న రాధాకిషన్‌రావును కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకుని, విచారించేందుకు పంజాగుట్ట పోలీసులు సిద్ధమవుతున్నారు. ట్యాపింగ్‌తోపాటు.. నగదు తరలింపు వెనక ఉన్న రాజకీయ శక్తులెవరనేది రాధాకిషన్ విచారణలో తేలుతుందని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. రాధాకిషన్‌ను ఏయే అంశాలపై ప్రశ్నించాలి? అనే దానిపై ఉన్నతాధికారుల బృందం ఇప్పటికే ఓ ప్రశ్నావళిని సిద్ధం చేసినట్లు సమాచారం. "పోలీసు వాహనాల్లో డబ్బులు తరలించాలని ఆదేశించిన నాయకులెవరు? ఎన్నిసార్లు నగదును తరలించారు? ఎక్కడి నుంచి ఎక్కడికి చేరవేశారు? ఎవరికి అందజేశారు? ఆ నగదును ఎక్కడి నుంచి సర్దుబాటు చేశారు? ఈ కుట్రలో ఇంకా ఎవరెవరికి భాగస్వామ్యం ఉంది?" అనే ప్రశ్నలకు రాధాకిషన్ నుంచి సమాధానాలు రాబట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఈ ప్రశ్నలకు రాధాకిషన్‌రావు నోరు తెరిస్తే.. గత ప్రభుత్వ పెద్దలు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు అరెస్టయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు.. మనీలాండరింగ్ కోణం ఉండడంతో.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కూడా రంగంలోకి దిగే సూచనలున్నాయి. కాగా, ఈ కేసులో మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావుది తొలి అరెస్టు కాగా.. ఆయనను అదే రోజు సస్పెండ్ చేశారు. అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న కూడా 48 గంటలకు మించి జైలులో ఉన్న నేపథ్యంలో నిబంధనల ప్రకారం వారిని సస్పెండ్ అయినట్లే..! అయితే.. సోమవారం అధికారికంగా సస్పెన్షన్ ఉత్తర్వులు వెలువడతాయని డీజీపీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

చంచల్‌గూడ జైలుపై నిరంతర నిఘా..!

ఫోన్ ట్యాపింగ్ సంచలన కేసు కావడంతో.. నిందితులు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న చంచల్‌గూడ జైలుపై ఉన్నతాధికారులు నిఘా పెంచారు. ప్రస్తుతం భుజంగరావు, తిరుపతన్న పోలీసు కస్టడీలో ఉండగా.. ప్రణీత్‌రావు, రాధాకిషన్‌రావు జైలులో ఉన్న విషయం తెలిసిందే..! దీంతో వారి బ్యారెక్‌లు, కదలికలు, ములాఖత్‌కు వస్తున్నవారిపై ఉన్నతాధికారులు నిఘా పెంచారు. ఎస్‌ఐబీ నుంచి డీఎస్పీ స్థాయి నేతృత్వంలోని ఓ బృందం ఈ నిఘాను పర్యవేక్షిస్తోంది.

అదుపులో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు..?

ఈ కేసులో ఇప్పటి వరకు ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎస్‌డీ) రాధాకిషన్‌రావు, మాజీ అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, ఐ న్యూస్ ఎండీ శ్రవణ్‌రావు నిందితులుగా ఉన్న విషయం తెలిసిందే! వీరితోపాటు.. ఐదుగురు ఇన్‌స్పెక్టర్లు కూడా పాత్రధారులేనని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఈ ఐదుగురిలో ఇద్దరు ఇప్పటికే విచారణకు హాజరయ్యారు. తాజాగా.. మరో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లను అదుపులోకి తీసుకుని, బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో విచారిస్తున్నట్లు తెలిసింది. వీరు గతంలో ఎస్‌ఐబీలో పనిచేశారా..? లేక టాస్క్‌ఫోర్స్‌లో రాధాకిషన్ టీమ్‌లో పనిచేశారా..? ఫోన్‌ట్యాపింగ్‌తో నేరుగా సంబంధం ఉందా? లేక రాధాకిషన్‌రావు ఆదేశాలతో వ్యాపారుల ప్రొఫైల్స్ తయారు చేసి, అక్రమ వసూళ్ల దందాకు పాల్పడ్డారా? అనే వివరాలు తెలియాల్సి ఉంది. మరోవైపు.. భుజంగరావు, తిరుపతన్న కింద పనిచేసిన సిబ్బందిపైనా అధికారులు ఆరా తీస్తున్నారు.

కేకేకు బీఆర్ఎస్ ఏం అన్యాయం చేసింది?

» ఆయనకు రెండుసార్లు రాజ్యసభ.. కూతురికి మేయర్ పదవి ఇచ్చాం

» కష్టకాలంలో పార్టీని వీడడం దురదృష్టకరం

» కాంగ్రెస్ పాలనలో అందరికీ అన్యాయం

» ఆరు నెలల్లో అధికారం బీఆర్ఎస్‌దే: హరీశ్



గజ్వేల్, మార్చి 30: "బీఆర్ఎస్ కేశవరావు(కేకే)కు రెండుసార్లు రాజ్యసభ ఎంపీగా అవకాశమిచ్చింది. ఆయన కూతురికి మేయర్ పదవి.. కొడుక్కి కార్పొరేషన్ చైర్మన్ పదవులు కూడా ఇచ్చింది. పార్టీలో పెద్ద మనిషిగా కేకేకు కేసీఆర్ ఎప్పుడూ గౌరవం ఇచ్చే వారు. కేసీఆర్ ఆయనకు ఏం అన్యాయం చేశారు? కష్టకాలంలో పార్టీని వదిలిపోవడం దురదృష్టకరం" అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేటలోని ఓ గెస్ట్‌హౌజ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. పార్టీ కష్టకాలంలో ఉండగా విడిచి పెట్టి వెళ్లిన వాళ్లను తర్వాత కాళ్లు మొక్కినా తీసుకోబోమని చెప్పారు. తమకు నష్టం చేసిన వారిని విడిచి పెట్టేది లేదని, లెక్కలు రాస్తున్నామని, తర్వాత వడ్డీతో సహా తీర్చుకుంటామన్నారు. రాష్ట్రంలో వంద రోజుల కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఆగమయ్యారని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నీటి బుడగలు అని, ఉద్దెర పథకాలు మొదలు పెట్టారని ఎద్దేవా చేశారు. మళ్లా బోర్లు వేసే కాలం వచ్చిందని, మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని, ఆరు నెలలు ఓపిక పడితే భవిష్యత్తు బీఆర్ఎస్‌దేనని, మళ్లీ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. గజ్వేల్ అభివృద్ధిని ఓర్వలేని బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌కు ఎందుకు ఓట్లు వేయాలని ప్రశ్నించారు. గజ్వేల్ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేసిన రఘునందన్ గురించి గ్రామాల్లో చర్చ పెట్టాలని హరీశ్‌రావు సూచించారు.

అందరికీ పనులు చేశా

తాను మంత్రిగా ఉన్నప్పుడు అందరికీ అన్ని పనులు చేశానని, సమాయాభావం వల్ల కడుపు నిండా మాట్లాడలేకపోయానని, ఇక నుంచి నా ప్రాణం అడ్డం పెట్టి అయినా కార్యకర్తల వెంట ఉంటానని హరీశ్‌రావు అన్నారు. ఏప్రిల్ 2న పూర్తిస్థాయిలో కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడుకుందామని చెప్పారు.

కామారెడ్డి మునిసిపాలిటీలో నెగ్గిన అవిశ్వాసం

» చైర్‌పర్సన్ పదవిని కోల్పోయిన జాహ్నవి

» వనపర్తిలో హైడ్రామా..

బీఆర్ఎస్‌కు 8 మంది రాజీనామా

కామారెడ్డి/మహబూబ్‌నగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కామారెడ్డి మునిసిపల్ కౌన్సిల్ పీఠాన్ని బీఆర్ఎస్ కోల్పోయింది. మునిసిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై కాంగ్రెస్ కౌన్సిలర్లు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి 10 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు కూడా మద్దతు తెలిపారు. దీంతో బీఆర్ఎస్ పార్టీ.. కామారెడ్డి మున్సిపాలిటీని కోల్పోవాల్సి వచ్చింది. కామారెడ్డి మునిసిపల్ చైర్‌పర్సన్‌పై ఈనెల 11 న కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో అధికారులు శనివారం బలపరీక్ష సమావేశం నిర్వహించారు. కామారెడ్డి మున్సిపల్ కౌన్సిల్‌లో మొత్తం 49 మంది సభ్యులు ఉండగా.. అవిశ్వాసం నెగ్గడానికి 34 మంది సభ్యుల అవసరం ఉంది. అయితే, శనివారం జరిగిన బలపరీక్షకు కాంగ్రెస్ పార్టీకి చెందిన 27 మంది కౌన్సిలర్లు, బీఆర్ఎస్‌కు చెందిన 10 మంది కౌన్సిలర్లు హాజరై అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. దీంతో కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానం నెగ్గిందని అధికారులు ప్రకటించారు. కాగా, కాంగ్రెస్ కౌన్సిలర్లు తనపై అవిశ్వాస తీర్మానం చెల్లుబాటు కాదని పేర్కొంటూ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఈనెల 12న తీర్పు వెలువడే అవకాశం ఉందని పేర్కొన్నారు. మరోవైపు వనపర్తి మునిసిపాలిటీలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికి షాక్ తగిలింది. కౌన్సిలర్లు ఎవరూ పార్టీని వీడొద్దన్న ఉద్దేశంతో చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్‌తో ఆయన రాజీనామా చేయించిన విషయం తెలిసిందే. అయితే, శనివారం 8 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి, కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. గత మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఐదుగురు సభ్యులు గెలువగా, ఆ తర్వాత బీజేపీ నుంచి ఇద్దరు, బీఆర్ఎస్ నుంచి ఇద్దరు ఆ పార్టీలో చేరారు. టీడీపీకి ఒక కౌన్సిలర్ ఉండగా ఆమె కూడా కాంగ్రెస్‌కే మద్దతు తెలుపుతున్నారు. తాజాగా 8 మంది కౌన్సిలర్ల రాజీనామాతో కాంగ్రెస్ బలం 18కి చేరనుంది. దీంతో మొత్తం 33మంది కౌన్సిలర్లున్న వనపర్తి మునిసిపల్ పీఠాన్ని కాంగ్రెస్ చేజిక్కించుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.





ప్రపంచ దేశాల చూపు మోదీ వైపు

బీజేపీ చేవేళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

దోమ, మార్చి 30: దేశ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వం కోసం దేశ ప్రజలతో పాటు ప్రపంచ దేశాలు ఎదురు చూస్తున్నాయని బీజేపీ చేవేళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాలెపల్లి, గోడుగోనిపల్లి, బాస్‌పల్లి, దోమ, ఐనాపూర్, మల్లెపల్లి తదితర గ్రామాల్లో శనివారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓటేసిన వారు ఇప్పుడు బీజేపీకి ఓటేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి దిశగా దూసుకెళ్తోందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.7లక్షల కోట్లు అప్పు చేసిందని ఆరోపించారు. కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారన్నారు. ఇప్పటికైనా ఓటు బ్యాంకు రాజకీయాలను పక్కన పెట్టాలన్నారు. ప్రజలకు కనీస సౌకర్యాలు విద్య, వైద్యంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఇక కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, రాష్ట్ర నాయకులు కరణం ప్రహ్లాద్‌రావు, పరిగి నియోజకవర్గ ఇన్‌చార్జి మారుతి కిరణ్ బూనెటి, మండల అధ్యక్షుడు పి.అనంతయ్య, నాయకులు యాదయ్య, మల్లేశం పాల్గొన్నారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

కులకచర్ల: కేంద్రంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ముజాహిద్‌పూర్, బండవెల్కిచర్ల, సాల్విడ్, ఘనపూర్, చౌడాపూర్, కొత్తపల్లి, మరికల్ తదితర గ్రామాల్లో శనివారం ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి బీజేపీకి ఓటు వేయాలని ఓటర్లతో అభ్యర్థించారు. గతంలో ఉన్న ఎంపీలు గ్రామాలకు వచ్చిన దాఖలాలు లేవని, తాను ఎల్లవేళాల ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రత్నం, ప్రహ్లాద్‌రావు, మారుతికిరణ్, మాధవరెడ్డి, వెంకటయ్యగౌడ్, సౌమ్యారెడ్డి, మైపాల్, సురేశ్, అంజిలయ్య, జానకిరామ్, మైపాల్, గుడాల వెంకటయ్య, శ్రీనివాస్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ చేవేళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

కార్యకర్తలతో కలిసి చెరువులో ఈత

ప్రజా ఆశీర్వాద యాత్రలో పాల్గొన్న కొండ విశ్వేశ్వర్‌రెడ్డి సరదాగా చెరువులో ఈత కొట్టారు. శుక్రవారం రాత్రి ముజాహిద్‌పూర్‌లో నిద్రించిన ఆయన శనివారం ఉదయం గ్రామ సమీపంలోని అక్కమ్మ చెరువుకు వెళ్లి కార్యకర్తలతో కలిసి స్నానం చేశారు.


విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

మేడ్చల్ టౌన్, మార్చి 30: మండలంలోని రావల్‌కోల్ గ్రామంలో శ్రీ రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గ్రామంలో నిర్మించిన ఆలయంలో వేదపండితులు మంత్రోచ్ఛరణల మధ్య అమ్మ వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ప్రత్యేకపూజలతో పాటు హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు వెంకటేష్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

● ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి

ఇబ్రహీంపట్నం, మార్చి 30 : వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకొని మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని ఇబ్రహీంపట్నం ఆర్డీవో కె.అనంతరెడ్డి అన్నారు. ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో శనివారం గురునానక్ విద్యా సంస్థల నుంచి ఇబ్రహీంపట్నం చౌరస్తా వరకు 5కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీఎం బాల్‌రాజ్, తహసీల్దార్లు రవీందర్ ప్రసాద్, అయ్యప్ప, ఎంపీడీవోలు నరేందర్‌రెడ్డి, బాలశంకర్, మున్సిపల్, రెవెన్యూ, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్ ఏజెన్సీని తనిఖీ చేసిన పౌరసరఫరాల అధికారి

శంషాబాద్, మార్చి 30: శంషాబాద్‌లోని ఓ పాత ఇనుపసామానుల దుకాణంలో నిన్న అగ్ని ప్రమాదం జరిగడంతో దాని పక్కనే ఉన్న ప్రియాంక గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాన్ని శనివారం పౌరసరఫరాలశాఖ అధికారి రఘునందన్ తనిఖీ చేశారు. ప్రమాదం జరిగినదుకాణంపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని నిర్వాహకులకు చెప్పారు. గ్యాస్ ఏజెన్సీ రికార్డులను పరిశీలించారు. కార్యాలయంలో గ్యాస్ సిలిండర్లు నిల్వ చేయరాదని ఆదేశించారు.

ఘట్‌కేసర్ ఎంపీపీ అరెస్ట్

● రిమాండ్‌కు తరలించిన పోలీసులు

ఘట్‌కేసర్‌రూరల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి) : బీజేపీ నాయకుడు, ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డిని మేడిపల్లి పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మేడిపల్లి మండలం, చెంగిచెర్లలో హోలీ వేడుకల సందర్భంగా రెండు వర్గాల మధ్య జరిగిన గొడవలో గాయపడిన హిందువులను పరామర్శించడానికి బీజేపీ నేత బండి సంజయ్‌కుమార్‌తో కలిసి ఎంపీపీ వెళ్లాడు. అనుమతి లేకుండా చెంగిచెర్లకు వచ్చిన బండి సంజయ్‌ని ఏ1, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ఏ2గా పేర్కొంటూ మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈమేరకు ఎంపీపీని ఘట్‌కేసర్ మండల పరిషత్ కార్యాలయం వద్ద అదుపులోకి తీసుకొని మేడిపల్లి పోలీసుస్టేషన్‌కు తరలించి సాయంత్రం రిమాండ్‌కు తరలించారు.


ఎమ్మెల్యే రంగారెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న నిర్వాహకులు

ఘనంగా వేంకటేశ్వరుడి ఉత్సవాలు

యాచారం, మార్చి 30 : యాచారం మండల కేంద్రంలోని శ్రీ తిరుమలేషుని గుట్టపై శనివారం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు తిలకిస్తుండగా వేదపండితులు స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి కల్యాణోత్సవంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, యాచారం ఎంపీపీ కొప్పు సుకన్యబాషా తదితరుల హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి వారి శోభాయాత్ర నిర్వహించారు.

బంగారు రుణాలపై రూ.కోటికి పైగా లాభం

తాండూరురూరల్, మార్చి 30: రైతులకు ఇచ్చిన బంగారు రుణాలపై రూ.కోటికి పైగా ఆదాయం వచ్చిందని ఎల్మకన్నె పీఏసీఎస్ చైర్మన్ రవీందర్‌గౌడ్ అన్నారు. సొసైటీ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ ప్రస్తుతం సొసైటీకి లాభం రూపంలో వచ్చిన డబ్బును రైతులకు రుణాల రూపంలో అందజేస్తామని తెలిపారు. అదేవిధంగా 26మంది రైతుల నుంచి రూ.16లక్షల మొండి బకాయిలు రావాల్సి ఉందని అన్నారు. ఈ సమావేశంలో సొసైటీ వైస్‌చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, సీఈవో శ్రీనివాస్, చంద్రారెడ్డి, అమతయ్య గౌడ్, రాఘవేందర్, వెంకట్‌రాంరెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

● డీపీవో సురేశ్‌మోహన్

చేవెళ్ల, మార్చి 30 : గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని డీపీవో సురేశ్ మోహన్ అధికారులకు సూచించారు. శనివారం శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, గ్రామ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా అవుతుందా లేదా అని ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలన్నారు. మిషన్ భగీరథ నీరు సరిపోని యెడల ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. సకాలంలో ఇంటి పన్నులు వసూళ్లు చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునే విధంగా కార్యదర్శులు పని చేయాలన్నారు. పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో సతీశ్‌రెడ్డి, ఎంపీడీవో వెంకయ్యగౌడ్, ఎంపీవో గీత, గ్రామ కార్యదర్శులు ఉన్నారు.


విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి

వైభవంగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

ఘట్‌కేసర్, మార్చి 30: మున్సిపాలిటీ పరిధి బొక్కోనిగూడలో శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించి శనివారం ఉదయం మంటపపూజలు, స్థాపిత దేవాతాహావననం, గర్తన్యాసం, యంత్రప్రతిష్ఠ, మూర్తిప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, బింబదర్శనం, బలిహరణ, హారతి, శాంతి కల్యాణం(సీతారాముల కల్యాణం) జరిపించారు. అనంతరం భక్తులు నూతర సీతారాములుకు ఓడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నూతన ఆలయంలో శ్రీ అభయాంజనేయ స్వామిని మేడ్చల్ జడ్పీచైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, డీసీసీ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, ఘట్‌కేసర్ వైస్‌చైర్మన్ మాధవరెడ్డి, పలువురు కౌన్సిలర్లు ఆయాపార్టీల నాయకులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కట్ట దేవేందర్‌రెడ్డి, బొక్క శ్రీనివాస్‌రెడ్డి, ఎంపాల సుధాకర్‌రెడ్డి, బొక్క కొండల్‌రెడ్డి, బొక్క ప్రభాకర్‌రెడ్డి, కట్ట సుధాకర్‌రెడ్డిలు భక్తులకు అన్నదానం చేశారు. పూజా కార్యక్రమాలకు హజరైన నాయకులను స్థానిక కౌన్సిలర్ బొక్క సంగీతా ప్రభాకర్‌రెడ్డి శాలువాలతో సత్కరించారు.

ప్రభుత్వ వసతిగృహాల సందర్శన

మోమిన్‌పేట్, మార్చి 30: ప్రజా సంఘాల నాయకురాలు, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి వై.గీత శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ వసతి గృహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్‌లో నెలకొన్న దుర్భర పరిస్థితులపై డీఈవో సమాధానం చెప్పాలన్నారు. అసౌకర్యాల నడుమ 30మంది విద్యార్థులకు 17మంది మాత్రమే హాస్టల్‌లో ఉంటున్నారని తెలిపారు. డీఈవో నిర్లక్ష్య ధోరణిని అవలంబిస్తున్నారని ఆరోపించారు. ప్రజాసంఘాల నాయకులు మాణిక్యం, శివకుమార్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

బెల్కటూర్‌లో సమస్యలు పరిష్కరించాలి

తాండూరు రూరల్, మార్చి 30: తాండూరు మండలం బెల్కటూర్ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు శనివారం అసెంబ్లీ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్‌ని కోరారు. వికారాబాద్‌లోని ఎమ్మెల్యే కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా ఆయనను కలిసి సన్మానించారు. స్పీకర్ స్వగ్రామం బెల్కటూర్ కావడంతో గ్రామస్తులతో ఆయన కాసేపు ముచ్చటించారు. గ్రామంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు స్పీకర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పల్లె నర్సింహులు, వెంకటేష్, చంద్రప్ప, జగ్గప్ప, రాములు, వెంకటప్ప, పకీరప్ప, శ్రీనివాస్, నర్సప్ప తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ భర్తపై చేయిచేసుకున్న ఎస్‌ఐ

యాలాల, మార్చి 30: గ్రామంలో జరిగిన ఓ కేసు విషయంలో తనను స్టేషన్‌కు పిలిపించి ఎస్‌ఐ చేయిచేసుకున్నాడని నాగసమందర్ గ్రామ మాజీ సర్పంచ్ భర్త ఆరోపించాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని నాగసమందర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కవిత భర్త భీమప్పను గ్రామంలో జరిగిన ఓ కేసు విషయంలో గత బుధవారం ఎస్‌ఐ శంకర్ భీమప్పను స్టేషన్‌కు పిలిపించారు. అక్కడ విచారణ అనంతరం గ్రామస్థుల సమక్షంలో తనపై ఎస్‌ఐ చేయి చేసుకున్నట్లు సర్పంచ్ భర్త భీమప్ప ఆరోపిస్తున్నాడు. ఇట్టి విషయంలో తనకు తగు న్యాయం చేయాలని మాజీ సర్పంచ్ కవితతో పాటు భర్త భీమప్ప డిమాండ్ చేశాడు. ఈ విషయంపై ఎస్‌ఐ శంకర్‌ను వివరణ కోరగా గ్రామంలో జరిగిన గొడవ విషయమై మాజీ సర్పంచ్ భర్త భీమప్పను విచారించినట్లు తెలిపారు. అంతేకానీ చేయిచేసుకోలేదని స్పష్టం చేశారు.

బాలుడి హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

కొడంగల్, మార్చి 30: కొడంగల్ మున్సిపల్ పరిధిలోని మిట్టిబౌలి కాలనీకి చెందిన అఫ్రోజ్ ఖాన్ కుమారుడు రజాఖాన్(11)ను అదే కాలనీకి చెందిన అజయ్ అనే యువకుడు కిడ్నాప్‌చేసి హత్య చేసి సూట్‌కేసులో పెట్టి ముళ్ల పొదల్లో పడేసిన సంఘటన 2022 అక్టోబరు 29న కొడంగల్‌లో సంచలనం రేపింది. ఈ ఘటనపై కొడంగల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుతో నిందితుడు అజయ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడు తప్పించుకోకుండా కచ్చితంగా శిక్షపడే విధంగా పోలీసు అధికారులతో దర్యాప్తు చేయించినట్లు వికారాబాద్ ఎస్పీ ఎన్.కోటిరెడ్డి తెలిపారు. బాలుడి కిడ్నాప్, హత్య సంఘటనపై అప్పట్లో ఎస్‌ఐ రవి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి, పోలీసు అధికారులతో కలిసి దర్యాప్తు చేపట్టగా కేసుకు సంబంధించిన వివరాలను వికారాబాద్ జిల్లా మెజిస్ట్రేట్‌కు సమర్పించగా వాదోపవాదాలు విన్న తర్వాత న్యాయమూర్తి సుదర్శన్ శనివారం నిందితుడు అజయ్‌కు జీవిత కారాగార శిక్ష విధించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడే విధంగా పని చేసిన అధికారులకు జిల్లా ఎస్పీ అభినందనలు తెలిపారు.



పరీక్షా కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు



వికారాబాద్: విజయ సంకేతం చూపుతున్న విద్యార్థినులు



కులకచర్ల: విక్టరీ చూపుతున్న విద్యార్థులు

ప్రశాంతంగా ముగిసిన 'పది' పరీక్షలు

వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మొన్నటి వరకు పరీక్షల కారణంగా పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు పరీక్షలు పూర్తి కావడంతో ఉపశమనం పొందారు. పరీక్షలు పూర్తి చేసుకుని బయటకు వచ్చే విద్యార్థుల్లో సంతోషం కనిపించింది. డీఈవో, విద్యా శాఖ అధికారులు, జీహెచ్‌ఎంల సమన్వయంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు చోటు చేసుకోలేదు. గతేడాది పదో తరగతి పరీక్షల్లో ఎదురైన అనుభవాల నేపథ్యంలో ఈ విద్యా సంవత్సరం కలెక్టర్ నారాయణరెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు. జిల్లా విద్యా శాఖ అధికారులు హాయిగా ఊపిరి పీల్చుకున్నా.. ఫలితాలు ఏ విధంగా ఉంటాయోనన్న ఆందోళన వారిలో వ్యక్తమవుతోంది.



బొంరాస్‌పేట్: పరీక్ష రాసిన విద్యార్థులు



బొంరాస్‌పేట్‌లో పరీక్షా కేంద్రం వద్ద కరపత్రాలు అందిస్తున్న ప్రైవేట్ కళాశాలల నిర్వాహకులు



పరిగి: పరీక్షా కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు



కులకచర్ల: పరీక్ష రాసిన విద్యార్థినులు



ధారూరు: పరీక్ష కేంద్రం నుంచి స్నేహితులతో కలిసి వస్తున్న విద్యార్థినులు



మర్పలి: పరీక్షా కేంద్రం వద్ద సెల్ఫీలు తీసుకుంటున్న విద్యార్థినులు



యాలాల: పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

వికారాబాద్ జిల్లాలో సీఎం వివక్ష



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితారెడ్డి

పెద్దేముల్, మార్చి 30: వికారాబాద్ జిల్లా తనదని చెపుతూనే జిల్లాపై సీఎం రేవంత్‌రెడ్డి వివక్ష చూపుతున్నారని మాజీ మంత్రి సబితారెడ్డి ఆరోపించారు. కొడంగల్‌కు వేల కోట్లు నిధులు ఇస్తున్న సీఎం ఇతర నియోజకవర్గాలకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. పెద్దేముల్ మండలం కందనెల్లి సమీపంలో జీపీఆర్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం తాండూరు నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఇట్టి సమావేశానికి ఎంపీ అభ్యర్థి కాసానిజ్ఞానేశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు పైలట్ రోహిత్‌రెడ్డి, ఆనంద్ హాజరయ్యారు. ఈసందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ కాసాని జ్ఞానేశ్వర్‌ను మనమంతా కష్టపడి గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కేసీఆర్ పాలనలో స్వర్ణయుగంగా ఉన్న తెలంగాణలో ఇపుడు కరెంటు కష్టాలు మొదలయ్యాయని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు పైలట్ రోహిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మేడ్చల్ మున్నూరు కాపు సంఘం నేతలు



రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంఘం నేతలు

మేడ్చల్ టౌన్, మార్చి 30: నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన మున్నూరు కాపు సంఘం నాయకులు శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. నగరంలోని సీఎం నివాసానికి సంఘం నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం నాయకులు సీఎంకు పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. నియోజకవర్గంలోని మండల కేంద్రాల్లో మున్నూరు కాపు కుల సంఘాల భవనాలకు భూములు కేటాయించాలని వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఐదు మండలాలకు చెందిన మున్నూరు కాపు సంఘాల అధ్యక్షులు ఆకుల సురేష్ పాల్గొన్నారు.

పాంబండ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కులకచర్ల, మార్చి 30: బండవెల్కిచర్ల ఏకశిల పర్వత పాంబండ శ్రీరామలింగేశ్వరస్వామి జాతర ఉత్స వాలు ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, గణపతి హోమం నిర్వహించిన అర్చకులు పాండు శర్మ, అనంత శర్మ దేవాలయం ముందు ధ్వజారోహణంతో ఉత్సవాలను ప్రారంభించారు.

భక్తి శ్రద్ధలతో శ్రీమల్లికార్జునస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

మేడ్చల్: తూంకుంటలో యాదవ సంఘం ఆధ్వర్యంలో దాతల సాయంతో ఇటీవల నూతనంగా శ్రీమల్లికార్జునస్వామి ఆలయాన్ని నిర్మించారు. శనివారం ఆ ఆలయంలో పండిత వేదబ్రహ్మణుల మంత్రోశ్చరణాలతో శ్రీమల్లికార్జునస్వామి విగ్రహాన్ని ఘనంగా ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొన్నారు.

కీసరలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

కీసర: కీసరగుట్టలో జరుగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా జరిగాయి. గత మూడు రోజులుగా జరుగుతున్న గ్రామదేవతల, నాభిశీల ప్రతిష్ఠాపనోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ మేరకు ఉదయం గణపతి పూజతో మూడవ రోజు పూజలు ప్రారంభించారు.

అంబా భవానీమాత ఆలయంలో పూజలు

బషీరాబాద్: దామర్‌చెడ్ అంబాభవానీమాత దేవస్థానంలో శనివారం ఆలయ పీఠాధిపతి శకరప్ప స్వామిజీ నేతృత్వంలో గీతాపారాయణం, గీతాయజ్ఞం, మృత్యుంజయ హోమం వంటి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ప్రైవేట్ పాఠశాల ఎదుట విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

ఘట్‌కేసర్, మార్చి 30: చౌదరిగూడలోని అక్షర ఇంటర్ నేషనల్ స్కూల్ యాజమాన్యం అధిక ఫీజల పేరుతో విద్యార్థులను దోచుకుంటున్నదని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు. యాజమాన్యం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పాఠశాల వద్ద శనివారం బైఠాయించారు. విద్యార్థులను పాఠశాలలో చేర్పుకునేటప్పుడు ఎన్నో మంచి మాటలు చెప్పి ఇప్పుడేమో ఫీజుల కోసం తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. గత సంవత్సరంతో పోలిస్తే రూ.20వేలు అదనంగా ఫీజు పెంచారని ఆరోపించారు. అదేవిధంగా పాత యూనీఫాంలు ఉన్నప్పటికీ కొత్త యూనీఫాంలు కొనాల్సిందేనంటూ ఇబ్బందులకు గురిచేయడమేంటని ప్రశ్నించారు. అదేవిధంగా ఫీజు చెల్లించడానికి ఆలస్యమైనా ఫైన్ వసూలు చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి లక్షర ఇంటర్నేషనల్ స్కూల్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.



ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పర్వత్‌రెడ్డి

కొడంగల్, మార్చి 30: రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యం.పర్వత్‌రెడ్డి అన్నారు. మండలంలోని పర్సాపూర్‌లో ప్రధానోపాధ్యాయుడు ఆశప్ప పదవీ విరమణ కార్యక్రమానికి శనివారం ఆయన హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు అర్హతలు కలిగి ఉండి కూడా పదోన్నతులు పొందకపోవడం దురదృష్టకరమన్నారు. 317 సీపీఎస్ విధానం రద్దు, సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు లాంటి సమస్యలపై ఎస్టీయూ నిరంతరం కృషి చేస్తుందన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుడు ఆశప్ప సుదీర్ఘంగా 26 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. పదవీ విరమణ కార్యక్రమంలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ.షఫీ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు శ్యామలమ్మ, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణుకుమార్, కరుణాకర్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరుపేద యువతికి పెళ్లి కానుక

కులకచర్ల, మార్చి 30: పటేల్ చెరువు తండా పంచాయతీలోని పొట్టిగడ్డ తండాలో విస్లావత్ తులసి రామ్, హరిచందర్ దంపతుల కూతురు నిఖిత పెళ్లి ఆదివారం జరగనుంది. వీరికి పెళ్లి కానుకను మాజీ సర్పంచ్ శాంతి తులసిరామ్ శనివారం అందజేశారు. పెళ్లి కానుకగా క్వింటాలు సోనా బియ్యం, 15 కేజీల మంచి నూనె డబ్బా అందించారు ఈ కార్యక్రమంలో యువకులు గణేశ్, సంతోష్, మాజీ వార్డు సభ్యురాలు లక్ష్మీ రామునాయక్, తండాపెద్దలు గంగ్యానాయక్, సేవ్యానాయక్, శ్రీను నాయక్ పాల్గొన్నారు.

ధ్యానంపై అవగాహన

కులకచర్ల, మార్చి 30: ధ్యానం చేయడంతో బీపీ, షుగర్, గుండె జబ్బులు వచ్చే అవకాశం ఉండదని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటి ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయరెడ్డి తెలిపారు. శనివారం కులకచర్ల మండలంలోని ముజాహిద్‌పూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ధ్యానంపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పిరమిడ్ సంస్థ సభ్యులు బాలకృష్ణారెడ్డి, సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

దోమ: మండలంలోని మోత్కూర్ గ్రామంలో బంగ్లా ఆంజనేయరెడ్డి ప్రజలకు, పాఠశాల విద్యార్థులకు ధ్యానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణారెడ్డి, తిరుపతయ్య, శైలజ, వెంకటేశ్, శోభిత, సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



5కే రన్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

కొడంగల్, మార్చి 30: ఓటు హక్కు ఉన్న ప్రతీఒక్కరూ వినియోగించుకోవాలని కొడంగల్ తహసీల్దార్ విజయ్‌కుమార్ అన్నారు. కొడంగల్ పట్టణంలోని పోస్టాఫీస్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు శనివారం కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్‌ఐ భరత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, ఎంఈవో రాంరెడ్డి, యువకులు, వివిధ శాఖల అధికారులతో కలిసి 5 కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఆర్ఐలు శృతి, రాఘవేందర్, రెవెన్యూ సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

నవాబుపేట, మార్చి 30: శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో నవాబుపేట మండలంలోని మీనపల్లి కలాన్ యంపీపీఎస్ పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చేందుకు శిక్షణ ఫౌండేషన్ ప్రోత్సాహం మరవలేనిదని ప్రశంసించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు శనివారం ప్రశాంస పత్రాలు, మెమోంటోలు, పరీక్షా ప్యాడ్‌లు, జామెట్రి బాక్సులు అందజేశారు.

ఉద్యోగ విరమణ సహజం



స్కూల్ అసిస్టెంట్ సుభాష్‌ను సన్మానిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

పరిగి, మార్చి 30: ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ అనేది సహజమని మోత్కూర్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బాలరాజ్ అన్నారు. మోత్కూర్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్ పని చేస్తున్న ఆర్.సుభాష్ శనివారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు సుభాష్‌ను ఘనంగా సన్మానించారు.

సంక్షిప్తంగా..

● **తాండూరు:** తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం క్లాసిక్ గార్డెన్‌లో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. రంజాన్ మాసం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ విందులో ముస్లింలు, మత పెద్దలు హాజరు కావాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కోరారు.

● **కులకచర్ల:** మండల కేంద్రంలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్రపై వీధి నాటకం కొనసాగుతోంది. రెండో రోజు శుక్రవారం రాత్రి నాటకం కొనసాగింది. డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని నాటకం నిర్వాహణకు సహకారం అందిస్తానని తెలిపారు. నాటకం నిర్వాహణకు పరిగి బ్లాక్ బీ అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్ రూ.5వేలు, కుమ్మరి నర్సిములు రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు.

● **పరిగి:** 33కేవీ రాపోల్, వాటర్‌గ్రిడ్ ఫీడర్స్ మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ ఖాజా తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని రాపోల్, సయ్యద్‌పల్లి, సయ్యద్‌మల్కాపూర్, రాఘవాపూర్, పొల్కంపల్లి, ఖుదావంద్‌పూర్,తొండపల్లి, యాభాజీగూడ, నర్సయాగూడ, గ్రామాలకు ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా ఉండదని తెలిపారు.

● **కొడంగల్ రూరల్:** రోడ్డు ప్రమాదంలో గాయపడిన నీమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కొడంగల్ మండలంలోని హస్నాబాద్ గ్రామానికి చెందిన రుబీనా బేగం కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి శనివారం రూ.3లక్షల 10వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో భీమయ్యమదన్ పాల్గొన్నారు.

● **కులకచర్ల:** మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో విద్యుత్ కోతలు మొదలయ్యాయి. గత రెండు రోజులుగా పగటి పూట విద్యుత్ కోతలు విధిస్తున్నారు. శుక్రవారం కులకచర్లలో జరిగిన సొసైటి సమావేశంలో పరిగి, తాండూర్ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డిలు మాట్లాడుతుండగా పలుమార్లు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో అక్కడున్న కాంగ్రెస్ నాయకులకు విస్మయాన్ని కలిగించింది. విద్యుత్ శాఖ అధికారులకు సూచిస్తున్నా కోతలు తప్పడంలేదనిస్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

క్రైం కార్నర్

రూ.9.39 లక్షలు స్వాధీనం

● వాహనాల తనిఖీల్లో భాగంగా సీజ్ చేసిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

తాండూరు, మార్చి 30: ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.9లక్షల 39వేలను సీజ్ చేసినట్లు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి తెలిపారు. తాండూరు పోలీస్ స్టేషన్ వద్ద శనివారం వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా మల్‌రెడ్డిపల్లికి చెందిన జట్బూర్ బస్వరాజ్ బైక్‌పై నగదు తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకొని ట్రెజరీకి పంపినట్లు డీఎస్పీ తెలిపారు. ఈమేరకు డబ్బుతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. తనిఖీల్లో సీఐ సంతోష్ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి



దశరథ్ మృతదేహం

తాండూరు రూరల్, మార్చి 30: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన తాండూరు మండలం కరన్‌కోట్ గ్రామంలో చోటు చేసుకుంది. కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటకలోని చించొలి తాలూకా లింగంపల్లి గ్రామానికి చెందిన డప్పు దశరథ్(45) ఆరు నెలల కిందట బతుకుదెరువు నిమిత్తం కరన్‌కోట్ గ్రామానికి వచ్చాడు. ఇక్కడే కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం గ్రామానికి చెందిన కొత్త నర్సయ్య గౌడ్ పొలంలో ఉన్న కట్టెలను ట్రాక్టర్‌లో నింపేందుకు వెళ్లాడు. ఏం జరిగిందో తెలీదు కానీ దశరథ్ అక్కడే విగతజీవిగా పడి ఉన్నాడు. గమనించిన స్థానికులు కరన్‌కోట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా, మృతుడి ఎడమకాలు పాదం వద్ద గాయాలు ఉన్నట్లు గుర్తించారు. మృతుడి భార్య మనోజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. అయితే తన భర్త మృతి పట్ల అనుమానం ఉన్నట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొంది.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



యాదప్ప (ఫైల్)

దౌల్తాబాద్, మార్చి 30: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ శ్రీశైలం యాదవ్ కథనం వివరాల ప్రకారం దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన యాదప్ప(27) తరచూ భార్యతో గొడవపడుతుండేవాడు. రోజూ మాదిరిగా శుక్రవారం రాత్రి భోజనం చేసి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహానికి పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం తాండూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య మున్నెమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భవనంపై నుంచి పడి మూడేళ్ల చిన్నారి మృతి



చిన్నారి టౌషిక (ఫైల్)

కీసర రూరల్, మార్చి 30: భవనం పై నుంచి పడి మూడేళ్ల చిన్నారి మృతిచెందింది. ఈ ఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. కీసర సీఐ వెంకటయ్య కథనం ప్రకారం.. సాయికుమార్ అనే వ్యక్తి తన కుటుంబసభ్యులతో కలిసి నాగారం మున్సిపాలిటీ ఈస్ట్ గాంధీనగర్‌లో నివాసముంటున్నాడు. తన టౌషిక(3) అనే కూతురు ఉంది. కాగా ఆ చిన్నారి ప్రమాదవశాత్తు శుక్రవారం రాత్రి కాలుజారి మొదటి అంతస్తు నుంచి కింద పడిపోయింది. బలమైన గాయాలు కావటంతో తల, చెవి నుంచి రక్తస్రావమైంది. వెంటనే చిన్నారిని చికిత్స నిమిత్తం స్థానికంగా ఉన్న జనని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి అంకుర ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తిపై టిప్పర్ యజమాని దాడి

● వాహనం నెమ్మదిగా తోలమన్నందుకు చితకబాదిన వైనం

● రాకపోకలను అడ్డుకుని శ్రీరంగవరం గ్రామస్తుల నిరసన



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

మేడ్చల్ టౌన్, మార్చి 30: రోడ్డు పై వాహనాలు జాగ్రత్తగా తోలాలంటూ మందలించన వ్యక్తిని లారీ టిప్పర్ యజమాని దాడికి దిగాడు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాయిలాపూర్ గ్రామ పరిధిలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శ్రీరంగవరం గ్రామానికి చెందిన ఆంజనేయలు శుక్రవారం రాత్రి తన బైక్‌పై రాయిలాపూర్ నుంచి శ్రీరంగవారం గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో డస్టు లోడ్‌తో ఎదురుగా వస్తున్న ఓ టిప్పర్ నుంచి కంకర, డస్టు రోడ్డుపై పడింది. దీంతో ఆంజనేయులు సదరు టిప్పర్‌ను ఆపి డ్రైవర్‌ను లారీలో తరలించే లోడు కింద పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మందలించాడు. దీంతో డ్రైవర్ తన టిప్పర్ యజమాని సాయి రెడ్డి ప్రవీణ్ రెడ్డికి సమాచారం ఇచ్చాడు. తన మిత్రులతో కలిసి అక్కడికి చేరుకున్న ప్రవీణ్‌రెడ్డి ఆంజనేయులును విచక్షణా రహితంగా చితకబాదాడు. దీంతో బాధితుడు శ్రీరంగవరం గ్రానమస్తులతో కలిసి శనివారం ఉదయం మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతటితో ఆగకుండా టిప్పర్ల రాకపోకలను పూర్తిగా అడ్డుకున్నారు. పోలీసులు జోక్యం చేసుకుని సదరు వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు. తమ గ్రామ శివార్లలోని క్రషర్ల వద్ద నుంచి డస్టు తరలించే టిప్పర్లలతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

సారా స్థావరంపై ఎక్సైజ్ దాడులు

● 10 మందిపై కేసులు నమోదు



సారాబట్టీలను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

పెద్దేముల్, మార్చి 30: గుట్టుచప్పుడు కాకుండా నాటుసారా తయారు చేస్తున్న స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి ధ్వంసం చేశారు. పది మందిపై కేసులు నమోదు చేశారు. ఎక్సైజ్ సీఐ బాలగంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మదనంతాపూర్, నెల్లిగడ్డతండాలలో బట్టీలు పెట్టి సారా తయారు చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. అక్కడ 2600లీటర్ల వాష్‌ను ధ్వంసం చేశారు. అదేవిధంగా 12కిలోల బెల్లంను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో పది మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ బాలగంగాధర్ తెలిపారు. రాంసింగ్‌తండాకు చెందిన సుభాష్, రాథోడ్ గోపాల్‌లను అరెస్టు చేసి వారిపై కేసులు నమోదు చేశామని చెప్పారు. తాండూరు ఎక్సైజ్ పరిధిలో ఈనెల మొత్తంలో జరిపిన దాడులలో మొత్తం 41 కేసులు నమోదు చేసి 19 మందిని అరెస్టు చేశామని తెలిపారు. వారి వద్దనుండి 75లీటర్ల గుడుంబా, 3650 లీటర్ల వాష్, 202 కిలోల నల్ల బెల్లం, 50 కిలోల పటిక పట్టుకున్నామని పేర్కొన్నారు.